సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 16 । మే । 2025



ఆదివాసీల అంగడి.. సందడి..
ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలు పండిస్తున్న కూరగాయలు నాణ్యంగా ఉండడంతో కొనుగోలుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు.
10లో



..మాయమాటలు చెబుతూ
జూన్ 12 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం కానుండగా ప్రైవేటు సంస్థల యాజమాన్యాలు తల్లిదండ్రులను మభ్యపెడుతున్నాయి.
8లో

గరిష్టం / కనిష్టం
38° / 26°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం ఉదయం ఉష్ణోగ్రత కాస్త తక్కువగా ఉన్నా మధ్యాహ్నానికి తీవ్రం అవుతుంది. వడగాలులు వీస్తాయి.

నెట్‌జీరో నెరవేరేనా?


తొలి విడతగా కొత్తగూడెంలో ఏర్పాటుచేసిన సోలార్ పవర్ ప్లాంట్

2023లో యాక్షన్ ప్లాన్ ప్రారంభించిన సింగరేణి

- 2024 కల్లా 532 మెగావాట్ల సోలార్ విద్యుత్ లక్ష్యం
- గడువు పూర్తయినా 300 మెగావాట్లు దాటని వైనం
- టెండర్ల దశలోనే మగ్గుతున్న కొత్త పవర్ ప్లాంట్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బహుముఖంగా విస్తరించిడంపై దృష్టి సారించిన సింగరేణి.. బొగ్గు ఉత్పత్తితో పాటు థర్మల్, సోలార్ విద్యుత్ రంగంలోకి వచ్చింది. త్వరలో రేర్ ఎర్త్ మినరల్స్ విభాగంలోనూ అడుగు పెట్టేందుకు సిద్ధమవుతోంది. అయితే నలుదిశలా విస్తరించే క్రమంలో ముందుగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో సంస్థ వెనకబడటం విమర్శలకు తావిస్తోంది.

2023లోనే టెండర్లకు పిలుపు..
కొత్తగా ఎనిమిది సోలార్ పవర్ ప్లాంట్లను వేర్వేరు ఏరియాల్లో నిర్మించాలని సంస్థ నిర్ణయించింది. ఇందుకోసం స్థల సేకరణ కూడా పూర్తి చేయడంతో పాటు ప్లాంట్ల నిర్మాణానికి రూ.1,348 కోట్లు కేటాయించింది. ఈ మేరకు 2023 ఆగస్టులో టెండర్లు ఆహ్వానించింది. సెప్టెంబర్‌లో ప్రీ బిడ్ సమావేశం నిర్వహించి, టెండర్లలో పాల్గొనే ఏజెన్సీల సందేహాలను నివృత్తి చేసింది. 2024 సెప్టెంబర్ నాటికి 232 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల నిర్మాణం పూర్తయి విద్యుదుత్పత్తి ప్రారంభించాలని అప్పటి సీఎండీ ఎన్.శ్రీధర్ టెండర్లలో పాల్గొన్న సంస్థలను కోరారు. అయితే నిర్దేశిత గడువు దాటి ఎనిమిది నెలలు పూర్తి కావొస్తున్నా పనులు ఒక కొలిక్కి రాలేదు. కేవలం మందమర్రిలో 67.50 మెగావాట్ల ప్లాంట్ పనులు ప్రారంభించడం గమనార్హం.

లక్ష్యానికి దూరంగా..
దశదిశలా విస్తరించే క్రమంలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో సింగరేణి వెనుకబడిపోతోందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత 72 మిలియన్ టన్నుల లక్ష్యానికి మూడు మిలియన్ టన్నులు తక్కువగా ఉత్పత్తి అయింది. నైనీ (ఒడిశా), ఇల్లెందు (రొంపేడు), కొత్తగూడెం (పీవీకే మెగా ఓసీ)లో కొత్త గనులు అందుబాటులోకి రాకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇప్పుడు సోలార్ పవర్ విషయంలోనూ అదే జరిగింది. నిర్దేశించిన గడువులోగా సెకండ్ ఫేస్ పనులు పూర్తయితే సింగరేణికి ప్రతీ ఏడాది విద్యుత్ బిల్లుల రూపంలో దాదాపుగా రూ. 290 కోట్లు ఆదా అయ్యేవి. అలాగే నెట్‌జీరో సాధించిన సంస్థగా దేశవ్యాప్తంగా గుర్తింపు దక్కేది. కానీ ఈ రెండూ సాధ్యం కాలేదు. ఇవి ఇలా ఉండగానే రాజస్థాన్‌తో ఒప్పందం, జియోథర్మల్ పవర్ ప్లాంట్, పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్, రేర్ ఎర్త్ మినరల్స్, విండ్ పవర్ అంటూ కొత్త రాగాలను ఆలపించడంపై విమర్శలు వస్తున్నాయి.

టార్గెట్ నెట్‌జీరో..
సింగరేణి సంస్థ ఆరు జిల్లాల పరిధిలో విస్తరించగా 18 ఓపెన్‌కాస్ట్, 22 భూగర్భ గనులు ఉన్నాయి. సుమారు 40 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. గనుల అవసరాలకు తోడు కార్మికుల సంక్షేమం కోసం సంస్థ భారీగా విద్యుత్‌ను వినియోగిస్తోంది. ప్రతీ ఏడాది వేర్వేరు అవసరాల నిమిత్తం 715 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వాడుతోంది. అయితే అంతే మొత్తంలో సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసి కాలుష్య నియంత్రణలో నెట్‌జీరో సంస్థగా నిలవాలని దశాబ్ద కాలంగా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో తొలి విడతలో సంస్థ పరిధిలోని అన్ని ఏరియాల్లో 300 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లను సిద్ధం చేసింది. తద్వారా 450 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సంస్థ ఆదా చేసినట్టయింది. నెట్‌జీరో రికార్డు దిశగా అడుగులు వేస్తూ మరో 232 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల స్థాపనకు రెండేళ్ల కిందటే ప్లాన్ సిద్ధం చేసింది.

సోలార్ పవర్ రెండో దశ వివరాలు

సోలార్ ప్లాంట్ ఏరియా	ఉత్పత్తి సామర్థ్యం (మెగావాట్లలో)	స్థలం (ఎకరాల్లో)
మందమర్రి	67.50	240
రామగుండం-3	37	166
శ్రీరాంపూర్	27.50	96
కొత్తగూడెం	32.50	130
జైపూర్	37.50	130
ఇల్లెందు	15	55
భూపాలపల్లి	10	45
రామగుండం - 1	5	13

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన


అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నివేదన, హారతి సమర్పించిన అర్చకులు ఆ తర్వాత మంత్రపుష్పం పఠించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి, అర్చకులు, వేదపండితులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లలో ఇంకుడు గుంతలు నిర్మించాలి

ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: జిల్లాలోని ప్రతీ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. ఎస్పీ కార్యాలయంలో నిర్మిస్తున్న ఇంకుడుగుంత పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంకుడు గుంతల ఏర్పాటుతో భూగర్భ జలాలు పెరుగుతాయని, భవిష్యత్‌లో నీటి కొరత సమస్యను అధిగమించవచ్చని తెలిపారు. వర్షపు నీటిని ఆదా చేసుకునేందుకు ప్రజలు కూడా ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించాలని కోరారు. ఈ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని చెప్పారు.

గిరిజన కళాశాలల్లో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్


విద్యార్థికి అడ్మిషన్ పత్రాలు అందజేస్తున్న ఆర్‌సీఓ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు గురువారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాలలో జరిగిన కౌన్సెలింగ్‌ను గురుకులాల ఆర్‌సీఓ అరుణకుమారి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలల్లో వివిధ కోర్సులకు గాను 810 సీట్లు ఉండగా, 450 సీట్లలో బాలురకు ప్రవేశాలకు కల్పించామని తెలిపారు. మిగిలిన సీట్ల భర్తీకి త్వరలో ప్రకటన చేస్తామని చెప్పారు. అలాగే, బాలికల ప్రవేశాల కోసం శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు దేవదాస్, సీతారాం, వీరస్వామి, సత్యనారాయణ, భాస్కర్, హరికృష్ణ, పద్మావతి, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన 108 ప్రోగ్రాం మేనేజర్


శివకుమార్

ఖమ్మంవైద్యవిభాగం/కొత్తగూడెంఅర్బన్ : ఈఎంఆర్‌ఐ, గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్‌గా శివకుమార్ నియమితులయ్యారు. ఉమ్మడి జిల్లాలోని 108(అత్యవసర సేవలు), 102(అమ్మ ఒడి), 1962(పశు సంచార) సేవలను పర్యవేక్షించనుండగా, గతంలో ప్రోగ్రాం మేనేజర్‌గా ఉన్న భూమా నాగేందర్ హైదరాబాద్ క్లస్టర్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వరంగల్ నుంచి వచ్చిన శివకుమార్ గురువారం విధుల్లో చేరారు. అనంతరం ఉద్యోగులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

తహసీల్దార్ల బదిలీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం) : రాష్ట్రవ్యాప్తంగా పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న కొందరిని ఇతర జిల్లాలకు కేటాయించారు. ఇదే సమయాన ఇతర జిల్లాలకు చెందిన కొందరిని జిల్లాకు బదిలీ చేశారు. వీరు నిర్దేశిత జిల్లాల్లో రిపోర్ట్ చేశాక కలెక్టర్లు పోస్టింగ్ ఇస్తారు. జిల్లా నుంచి బదిలీ అయిన వారిలో ఎం.రమాదేవి ఖమ్మం జిల్లాకు, సీహెచ్.నరేష్, జి.వివేక్, ఎం.ఇమ్మానియేల్, ఎస్.నాగభవానీ మహబూబాబాద్ జిల్లాకు వెళ్లారు. కాగా, హన్మకొండ జిల్లా నుంచి ఆర్.అనంత రామకృష్ణ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి ఎల్.వీరభద్రం, ఖమ్మం జిల్లా నుంచి జి.ప్రతాప్, మహబూబాబాద్ జిల్లా నుంచి బి.భగవాన్‌రెడ్డి భద్రాద్రి జిల్లాకు రానున్నారు.

భూ భారతి దరఖాస్తులపై విచారణ చేపట్టాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం) : భూ భారతి చట్టం కింద రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1,679 భూభారతి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, నూతన ఆర్ఓఆర్ చట్టం నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని అన్నారు. రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల బాధ్యత కీలకం..
పాల్వంచ: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. స్థానిక కేజీబీవీలో జరుగుతున్న ప్రత్యేక ఉపాధ్యాయుల శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు. భవిత కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్, సీఎంఓ సైదులు, హెచ్‌ఎం మధురవాణి, మంగమ్మ, తులసీ పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం..
జూలూరుపాడు: రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పాటిల్ అన్నారు. గురువారం ఆయన మాచినేనిపేటతండా, నర్సాపురం, జూలూరుపాడులో ఇంకుడు గుంతల పనులను ప్రారంభించారు. ఉపాధి కూలీలతో కలిసి పని చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కష్టపడి పని చేయడం తనకెంతో ఇష్టమని, టీవీ, సెల్‌ఫోన్ల ముందు కూర్చోకుండా యువత పని చేయాలని సూచించారు. గోపాతండాలో బానోత్ బోజ్లీ సాగు చేసిన మునగ తోటను పరిశీలించి సాగు ఎలా ఉంది.. కొనుగోలు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. మునగ కాయలు కొనుగోలు చేసేందుకు పొలం వద్దకే వస్తున్నారని రైతు చెప్పగా కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. రైతులంతా మునగ సాగు చేయాలని, ఎకరానికి రూ.లక్ష ఆదాయం వస్తుందని చెప్పారు. మండలంలో ఇంకుడు గుంతల నిర్మాణాలు వేగవంతంగా సాగుతుండగా అధికారులను అభినందించారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు రాలేదని స్థానికులు కలెక్టర్ దృష్టికి తేగా.. ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతరాయంగా సాగుతుందని, అర్హులందరికీ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, ఎంపీడీఓ కరుణాకర్ రెడ్డి, ఎంపీఓ తులసీరామ్, ఏఓ దీపక్ ఆనంద్, ఎంఈఓ బానోత్ జుంకీలాల్ పాల్గొన్నారు.


చంద్రుగొండ : ఉపాధి కూలీతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్


జూలూరుపాడు : ఇంకుడు గుంత నిర్మాణ పనుల్లో మట్టి ఎత్తుతున్న కలెక్టర్

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి
కొత్తగూడెంటౌన్: లక్ష్మీదేవిపల్లి మండలం ఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ తరగతులను కలెక్టర్ సందర్శించారు. నిరంతర సాధనతో ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ పరంధామరెడ్డి, కోచ్‌లు ఎండీ అబ్దుల్ నబీ, ఇమామ్, బిస్వజిత్ కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన..
చంద్రుగొండ : మండలంలోని మంగయ్యబంజర్, పోకలగూడెం, రావికంపాడు గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్.. ఉపాధి పనులను పరిశీలించారు. పలుగు, పార పట్టి మట్టిపనులు చేస్తూ కూలీల్లో ఉత్సాహం నింపారు. మంగయ్యబంజర్‌లో ఫాంపాండ్ పనులను, పోకలగూడెంలో పంటచేల మధ్య నిర్మాణ దశలో ఉన్న రోడ్డు పనులను పరిశీలించారు. రావికంపాడులో పశువుల షెడ్, మునగతోట, ఇంకుడు గుంతలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బయ్యారపు అశోక్, టెక్నికల్ ఈసీ రాజు, ఏఓ నవీన్, ఎంపీఓ ఖాన్, ఏపీఓ శ్రీను పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నృసింహస్వామికి చక్రస్నానం..
శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీయోగానంద లక్ష్మీ నృసింహ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి పవిత్ర గౌతమీ నదిలో చక్రస్నానం కార్యక్రమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి మేళతాళాలు, మహిళా భక్తుల కోలాట నృత్యాల నడుమ గోదావరి తీరానికి తీసుకెళ్లి నదీ జలాలతో చక్ర స్నానం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఈ వేడుకను తిలకించి పులకించారు.


నృసింహస్వామికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

గిరిజన సంస్కృతిని పరిరక్షించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

ములకలపల్లి : గిరిజన సంస్కృతిని పరిరక్షించాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ అన్నారు. మండల పరిధిలోని రాజీవ్‌నగర్‌లో గురువారం నిర్వహించిన భూమి పండుగ వేడుకకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదివాసీలు ఏ కార్యం తలపెట్టినా గ్రామదేవతలను పూజించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం స్థానిక యువకులతో కలసి బాణం సంధించారు. ఆ తర్వాత పాత గుండాలపాడు గ్రామాన్ని సందర్శించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. 35 ఏళ్ల క్రితం అప్పటి పీఓ జేసీ శర్మ తమ గ్రామాన్ని సందర్శించారని, మళ్లీ ఇప్పుడు రాహుల్ రావడం ఆనందంగా ఉందని స్థానికులు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డును పూర్తి చేయాలని, ఐటీడీఏ ద్వారా వ్యవసాయ మోటార్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో భద్రాచలం గిరిజన మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి, గ్రామ పెద్దలు తుర్రం శ్రీను, మాజీ ఎంపీటీసీ నూపా సరోజిని తదితరులు పాల్గొన్నారు.


విల్లు ఎక్కుపెట్టిన పీఓ రాహుల్

బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ పరిశీలన

గనిని సందర్శించిన అటవీ శాఖ ఉన్నతాధికారులు

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ, గనుల్లో ఉపయోగిస్తున్న కంటిన్యూస్ మైనర్, ఎల్‌హెచ్‌డీ యంత్రాల పనితీరును అటవీ శాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. కొత్తగూడెంలోని పీవీకే –5 ఇంక్లైయిన్ గనిని గురువారం వారు సందర్శించారు. ఏరియాకు వచ్చిన అధికారుల బృందానికి జీఎం ఎం.శాలేంరాజు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం గని అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా బొగ్గు ఉత్పత్తి, రవాణాకు సంబంధించిన వివరాలు, యంత్రాల పనితీరును తెలియజేశారు. ఆ తర్వాత అధికారులు మ్యాన్‌రైడింగ్ ద్వారా గనిలోకి దిగి పంపింగ్ స్టేషన్, సబ్‌స్టేషన్ ప్రాంతాలను వీక్షించారు. అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (సెంట్రల్) డాక్టర్ వి.ఆర్.జెన్సర్ ఆధ్వర్యంలో డాక్టర్ త్రినాథ్‌కుమార్, సీసీఎఫ్ డి.భీమానాయక్, ఖమ్మం జిల్లా అటవీ శాఖ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, కొత్తగూడెం డివిజనల్ అటవీ అధికారి కోటేశ్వరరావు తదితరులు పర్యటించారు.


పీవీకే-5 ఇంక్లెయిన్ గనిలో అటవీ శాఖ ఉన్నతాధికారులు

మాడ వీధులకు వీడని మూఢం

- భూ సేకరణ పూర్తయితేనే పనులు ముందుకు
- స్థలం ఇచ్చేందుకు ఏడుగురి నిరాకరణ
- ఈ అడ్డంకి తొలగితేనే సాగనున్న విస్తరణ
- మాస్టర్ ప్లాన్ ప్రకటన కోసం ఎదురుచూపులు


భూ సేకరణ జరగనున్న రామాలయ సమీప ప్రాంతం


భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి తొలి అడుగు పడినా.. ముందుకు సాగడం లేదు. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా మాడ వీధుల విస్తరణకు ప్రభుత్వం రూ.60.20 కోట్లు ప్రకటించింది. ఈ మేరకు భూసేకరణ, ఇళ్లు, దుకాణాల తొలగిస్తే నిర్వాసితులకు అందించే పరిహారం కోసం శ్రీరామనవమికి ముందు రూ.35 కోట్లు విడుదల కాగా, సుమారు 40 కుటుంబాలకు అందజేశారు. నవమి రోజే అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసి, మాస్టర్ ప్లాన్ ప్రకటిస్తారని భావించినా అది జరగలేదు. దీనిపై ఆలయ అధికారులకు సీఎం స్పష్టమైన సూచనలు చేసినట్లు సమాచారం. భూ సేకరణ పూర్తయితేనే పనులు ముందుకు సాగే పరిస్థితి నెలకొంది.

ఈనెలలో సేకరణ పూర్తయితేనే..
నిర్వాసితులకు నష్టపరిహారం అందజేయగానే రెవెన్యూ అధికారులు భూ సేకరణ పూర్తి చేసి దేవస్థానానికి అప్పగించాల్సి ఉంది. అయితే శ్రీరామనవమి సందర్భంగా తమ వ్యాపారం దెబ్బతింటుందని, ఆ తర్వాత తాము ఖాళీ చేస్తామని ఆయా షాపుల వారు రెవెన్యూ అధికారులను, ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. దీంతో అప్పుడు సేకరణ పనులు ఆపేశారు. నవమి వేడుకలు పూర్తయ్యాక అధికారులు మళ్లీ భూ స్వాధీనానికి వెళ్లగా.. ఈనెల 22న హనుమాన్ జయంతి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే మాలధారులతో భద్రగిరి రద్దీగా ఉంటుందని, ఈ సమయంలోనే వ్యాపారాలు అధికంగా జరుగుతాయి కాబట్టి మరోమారు వాయిదా వేయాలని వారు వేడుకుంటున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు పునరాలోచనలో పడ్డారు. కాగా, భూమి ఇవ్వడానికి నిరాకరించిన వారిపై కోర్టును ఆశ్రయించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వారికి అందజేయాల్సిన నష్టపరిహారాన్ని కోర్టుకు సరెండర్ చేసి, భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

కొన్ని కుటుంబాల నిరాకరణ..
భద్రాచలంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు ముందే 40 నిర్వాసిత కుటుంబాలకు రూ.34,45,86,000 అందించినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. అయితే ఇటీవల సస్పెన్షన్‌కు గురైన ఓ ప్రధానార్చకుడితో పాటు మరో ఆరు కుటుంబాల వారు స్థలాలు ఇచ్చేందుకు, నష్టపరిహారం స్వీకరణకు నిరాకరించారని చెబుతున్నారు. వీరు గతంలో కూడా మాడ వీధుల విస్తరణలో పరిహారం స్వీకరణకు నిరాకరించారు. ప్రభుత్వం ప్రకటించిన మొత్తం కంటే అధికంగా ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రెవెన్యూ, ఆలయ అధికారులు తీసుకునే చర్యలపైనే పనులు ఆధారపడి ఉంటాయి.

మాస్టర్‌ప్లాన్ అమలు చేయాలి..
మాడ వీధుల విస్తరణకు ప్రభుత్వం రూ.60.20 కోట్లు ప్రకటించగా, నిర్వాసితులకు పరిహారంగా రూ.35 కోట్లు విడుదల చేసింది. మరో రూ.25.20 కోట్లతో మాడ వీధుల విస్తరణ చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే ఆలయ అభివృద్ధిపై దృష్టి సారిస్తారు. కాగా నవమి ముందు ప్రభుత్వం ఆలయ అభివృద్ధి నమూనాలు విడుదల చేసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన మాస్టర్ ప్లాన్‌కు మరికొన్ని అదనపు వసతులను కల్పించేలా ఈ నమూనాలు రూపొందించారు. అయితే మాడ వీధుల విస్తరణకు నిధులు విడుదల చేసిన ప్రభుత్వం.. మాస్టర్ ప్లాన్ అమలుకూ తగిన నిధులు మంజూరు చేయాలని భక్తులు కోరుతున్నారు.

నిరాకరించిన వారితో చర్చిస్తాం..



ఏడు కుటుంబాల వరకు నష్టపరిహారం చెక్కులు తీసుకోలేదు. వారితో మళ్లీ చర్చలు జరిపి సానుకూలంగా భూ సేకరణకు కృషి చేస్తాం. అయినా వినకుంటే నిబంధనల ప్రకారం నష్టపరిహారాన్ని కోర్టుకు అందజేసి భూ సేకరణను పూర్తి చేస్తాం. వీలైనంత త్వరలో ఆలయానికి భూములు అందజేస్తాం.
– కొల్లు దామోదర్ రావు, ఆర్డీఓ, భద్రాచలం

తిరోగమన విధానాలతో ప్రజా వ్యతిరేకత

- అందాల పోటీలతో కాంగ్రెస్ పరువు గంగపాలైంది
- బీఆర్‌ఎస్ నాయకుడు రాకేష్‌రెడ్డి


మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి, పక్కన కాపు సీతాలక్ష్మి తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అందాల పోటీలను ఆర్భాటంగా నిర్వహిస్తున్న కాంగ్రెస్ పరువు గంగపాలైందని బీఆర్‌ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడి అన్నారు. కొత్తగూడెంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిరోగమన విధానాలు అవలంబిస్తూ ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుంటున్నారని విమర్శించారు. అందాల పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విదేశీ మహిళల కాళ్లను ఓరుగల్లు ఆడబిడ్డలతో కడిగించారని ఆరోపించారు. ఇందిరాగాంధీ, సోనియా అమ్మలైతే కాళ్ల కడిగిన ఆడబిడ్డలు ఎవరని ప్రశ్నించారు. పోటీలకు వచ్చిన వారిని అతిథులుగా చూడాలే తప్ప దేవకన్యలుగా కాదన్నారు. ఇది రాణి రుద్రమ, చాకలి ఐలమ్మ, సమ్మక్క, సారక్క నడయాడిన నేలని, ప్రతీ ఆడబిడ్డలో ఆ పౌరుషం, తెగింపు ఉంటాయని అన్నారు. కాళ్లుకడిగిన ఆడపడుచుల కాళ్లను రేవంతరెడ్డి కడిగి ఆ నీటిని నెత్తిన చల్లుకోవాలని సూచించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలుచేయడం లేదని ధ్వజమెత్తారు. సింగరేణి కార్మికులను కేసీఆర్ కడుపులో పెట్టుకుని చూసుకున్నారని, ప్రతి కార్మికుడికి 250 గజాల స్థలం ఇస్తామన్న కాంగ్రెస్ వాగ్దానం నేటికీ అమలు కాలేదని అన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, నాయకులు తొగరు రాజశేఖర్, సింధూ తపస్వి, ప్రసాద్, పురుషోత్తం, మురళి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లాజిస్టిక్స్ నిర్వహణపై శిక్షణ



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్

కొత్తగూడెంఅర్బన్: జిల్లా వైద్యా, ఆరోగ్య శాఖ కార్యాలయంలో కుటుంబ నియంత్రణ లాజిస్టిక్స్ నిర్వహణ, సమాచార వ్యవస్థపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 12 ముఖ్యమైన కుటుంబ నియంత్రణ వస్తువులను సమర్థవంతంగా నిర్వహించే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ఎఫ్‌పీ, ఎల్‌ఎంఐఎస్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి, డాక్టర్లు చైతన్య, సుకృత, మధువరన్, తేజశ్రీ, ఫైజాయాజుద్దీన్, ఫార్మసిస్టులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడెం హెచ్‌ఎంపై విచారణ

ఇల్లెందురూరల్: మండలంలోని మర్రిగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్‌పై డీఈఓ వెంకటేశ్వరాచారి విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా టేకులపల్లి ఎంఈవో జగన్‌కు బాధ్యతలు అప్పగించారు. మర్రిగూడెం పాఠశాలలో ఆరేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధాయుడు రమేష్ విధులకు సక్రమంగా హాజరుకాలేదని, పాఠశాలకు మంజూరైన నిధులను దుర్వినియోగం చేశారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేతలు, స్థానికులు డీఈఓకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఈఓ ఆదేశాలతో టేకులపల్లి ఎంఈఓ గురువారం విచారణ ప్రారంభించారు.

మహిళా సమాఖ్య నూతన పాలకవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ విద్యాచందన

చుంచుపల్లి: మహిళా సమాఖ్య జిల్లా నూతన పాలకవర్గాన్ని గురువారం కొత్తగూడెంలో ఎన్నుకున్నారు. ప్రస్తుత జిల్లా అధ్యక్షురాలు ఎస్.ఉషారాణి, కార్యదర్శి వి.నాగమణి, కోశాధికారి వి.మమత ఉద్యోగ విరమణ పొందారు. వారి స్థానంలో అధ్యక్షురాలిగా ఎస్.సుజాత, కార్యదర్శిగా కె.సునీత, కోశాధికారిగా కె.సౌజన్య ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ విద్యాచందన మాట్లాడుతూ బ్యాంక్ లింకేజీలో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపారని అభినందించారు. అదనపు డీఆర్‌డీఓ, డీపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.


పది జిల్లాల మత్స్యకారులకు శిక్షణ



మాట్లాడుతున్న లవకుమార్

కూసుమంచి: పాలేరులోని పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో మత్స్యకారులకు మూడు రోజుల పాటే శిక్షణ గురువారం ప్రారంభమైంది. 'జలాశయాల్లో మత్స్య అభివృద్ధి – యాజమాన్య పద్ధతులు' అంశంపై ఇస్తున్న ఈ శిక్షణకు ఖమ్మం, నిజామాబాద్, హనుమకొండ, కామారెడ్డి, కుమురంభీం ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సిరిసిల్ల జిల్లాల మత్స్యకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలిరోజు మత్స్యశాఖ నేషనల్ ఫెసిలిటేటర్ బి.లవకుమార్ మాట్లాడుతూ శిక్షణను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా మత్స్య సంపదలో రాష్ట్రాన్ని ముందు నిలపాలని సూచించారు. చేపల పెంపకంలో ఆధునిక పద్ధతులు అవలంబిస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. పరిశోధనా కేంద్రం పూర్వ, ప్రస్తుత ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ జి.విద్యాసాగర్‌రెడ్డి, డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడగా మత్స్య శాస్త్రవేత్తలు రవీందర్, గణేష్ పాల్గొన్నారు.

వడదెబ్బతో ఒకరి మృతి



బండి రాజమ్మ (ఫైల్)

కామేపల్లి: కామేపల్లి ఇరిగేషన్ సబ్‌డివిజన్‌లో లష్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బండి రాజమ్మ (60) వడదెబ్బతో మృతి చెందింది. ఇటీవల ఆమె అస్వస్థతకు గురి కాగా చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందిందని కుటుంబీకులు వెల్లడించారు. ఇరిగేషన్ డీఈఈ శంకర్, ఏఈఈ శ్యామ్, ఉద్యోగులు పలువురు ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

మభ్య పెట్టి.. మాయమాటలు చెబుతూ..

విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాల వల

- ఉపాధ్యాయులకు టార్గెట్లు ఇచ్చి ఇంటింటి ప్రచారం చేయిస్తున్న వైనం
- రాయితీలు కల్పిస్తామంటూ పాఠశాలల్లో చేర్పించుకునేందుకు ప్రయత్నం
- ఎప్పటిలాగే చర్యలు చేపట్టని జిల్లా విద్యాశాఖ అధికారులు



కొత్తగూడెంఅర్బన్: వచ్చే నెల 12వ తేదీ నుంచి 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభంకానుండగా, ఇప్పటినుంచే ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు పిల్లలను, తల్లిదండ్రులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఇంటింటి ప్రచారం చేస్తూ పిల్లలను తమ విద్యాసంస్థల్లో చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి నెల రోజుల సమయం ఉండగా, ఈలోగా వీలైనంత ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించేందుకు ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు టార్గెట్లు ఇచ్చి ఇంటింటి ప్రచారానికి పంపిస్తున్నాయి. ఉపాధ్యాయులు పల్లెలు, పట్టణాల్లో ఉదయం ఏడు గంటలకే అడ్మిషన్ల ప్రచారం మొదలుపెడుతున్నారు. తమ పాఠశాల, కళాశాలలో చదివితే పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు అవుతారని తల్లిదండ్రులను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రైమరీ సెక్షన్‌లో ఒక్కో తరగతికి అన్ని రకాల ఫీజులు కలిపి రూ.50 వేల వరకు ఉంటుందని, తాము రూ.40 వేలకే అడ్మిషన్ కల్పిస్తామని, పీజీలో గోల్డ్‌మెడల్ సాధించిన వారితో విద్యాబోధన చేయిస్తున్నామని మభ్యపెడుతున్నారు. ఒకటో, ఆరో తరగతిలో చేరే పిల్లల వివరాలు సేకరించి తల్లిదండ్రులను కలిసి ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. తీరా పాఠశాలలో చేరాక ఎప్పటిలాగే భారీగా ఫీజులు వసూళ్లు చేస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటనలు ఏటా జరుగుతూనే ఉన్నాయి.

తనిఖీలు చేయకుండానే అనుమతులు!

ఏటా జిల్లాలో ప్రైవేటు విద్యా సంస్థల సంఖ్య పెరుగుతోంది. ప్రైవేటు పాఠశాలల ఏర్పాటు సమయంలో ఆ ఏరియాలో ప్రభుత్వ పాఠశాల ఉందా, సమీపంలో ఎన్ని ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి? విద్యార్థులకు అసౌకర్యం కలిగించే అంశాలు ఏమైనా ఉన్నాయా? తదితర విషయాలను తెలుసుకునేందుకు విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల్లో తనిఖీలు చేయాలి. ఆ తర్వాతే అనుమతులు జారీ చేయాలి. కానీ కొన్నేళ్లుగా జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టకుండా ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కనీసం క్రీడా స్థలం కూడా లేని ప్రైవేటు పాఠశాలలకు కూడా అనుమతులు జారీ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఏ ఒక్క ప్రైవేటు పాఠశాలలోనూ నోటీస్ బోర్డుపై ఫీజు వివరాలు ప్రదర్శించడంలేదు. జిల్లాలో ఇప్పటికే 220 పైగా ప్రైవేటు పాఠశాలలు ఉండగా, ఈ విద్యా సంవత్సరం ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు పాఠశాలలకు అనుమతులు ఇచ్చే ముందు ఆ పాఠశాలల్లో ఫైర్ సేఫ్టీ, ప్లే గ్రౌండ్, గ్రీనరీ, నాలుగు, ఐదు అంతస్తులకు పిల్లలు వెళ్లేందుకు గల సదుపాయం, ఉపాధ్యాయుల అర్హతలు వంటివి పరిశీలించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే విద్య వ్యాపారమయంగా మారిందని, కొంతమేరకైనా విద్యావ్యవస్థను కాపాడాలని పేర్కొంటున్నారు. తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉంటూ అనుమతి ఉన్న, నిబంధనలు పాటించే పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని సూచిస్తున్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల ప్రచారమేది..?

సర్కారు పాఠశాలలు, కళాశాలల్లో మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతోంది. పాఠశాలలు, వసతిగృహాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోంది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల నుంచి ప్రచారం కొరవడుతోంది. దీనికితోడు నాణ్యమైన విద్యనందించేందుకు పటిష్ట బోధన కూడా జరపడంలేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



జిల్లాలో రానున్న విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే తనిఖీలు చేపడతాం. నోటీస్ బోర్డులో ఫీజు వివరాల పట్టిక లేకపోతే పాఠశాల అనుమతి రద్దుకు కూడా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నాం. ఈ ఏడాది ప్రత్యేకంగా ఉపాధ్యాయులకు బోధనపై శిక్షణ కూడా ఇస్తున్నాం. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే చేరాలి.

–ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా విద్యాశాఖాధికారి

వ్యవసాయాధారిత ఉత్పత్తులు తయారు చేయాలి

అశ్వారావుపేటరూరల్: రైతులు వ్యవసాయంపైనే ఆధార పడకుండా, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులను కూడా తయారీ చేసి ఆదాయం పొందాలని శాస్త్రవేత్తలు డాక్టర్ మధుసూధన్‌రెడ్డి, డాక్టర్ పావని, డాక్టర్ కృష్ణతేజ సూచించారు. గురువారం మండలంలోని బచ్చువారిగూడెం గ్రామంలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో వారు మాట్లాడారు. రైతులు తమ ధరను తామే నిర్ణయించాలంటే ఒక్క వ్యవసాయంపైనే ఆధారపడితే సరిపోదని, విలువ ఆధారిత ఉత్పత్తులను కూడా తయారీ చేయాలన్నారు. పొలంలో ఉండే ప్రతి కీటకం హాని కలిగించేది కాదని, మిత్ర పురుగులు కుడా ఉంటాయని వివరించారు. అనంతరం ప్రచార పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ శివరాం ప్రసాద్, హెచ్ఓ వేణుమాధవ్, ఏఈఓలు ఎన్.రవీందర్, సతీష్, షకీరాభాను, కార్యదర్శి మెహరాజ్ ఉద్దీన్, రైతులు పాల్గొన్నారు.



ప్రచార పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఆయిల్‌పామ్ సాగుతో ఆదాయం



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దమ్మపేట : స్థిర ఆదాయం ఆయిల్‌పామ్ పంటతోనే సాధ్యమని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జే కిషోర్ అన్నారు. గురువారం మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో మహిళా రైతులు దొడ్డా శిరీష, దొడ్డా అన్నపూర్ణల వ్యవసాయ క్షేత్రంలో పామాయిల్ మొక్కలు నాటే కార్యక్రమంలో డీహెచ్ఎస్ఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట సాగుకు ప్రభుత్వం మొదటి నాలుగు సంవత్సరాలపాటు రాయితీ, సబ్సిడీ కల్పిస్తోందని తెలిపారు. తోటలో మొదటి మూడు సంవత్సరాలు అంతర పంటలు సాగు చేసుకోవచ్చని, నాలుగో సంవత్సరం నుంచి 35 సంవత్సరాల వరకు పామాయిల్‌పై ఆదాయం పొందవచ్చని అన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అశ్వారావుపేట పామాయిల్ నర్సరీ ఇన్‌చార్జి రాధాకృష్ణ, ఆయిల్‌ఫెడ్ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ఘర్షణ



గొడవ పడుతున్న మహిళలు

అశ్వాపురం: ఆర్టీసీ మణుగూరు డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సులో ఇద్దరు మహిళలు ఘర్షణ పడిన పంచాయతీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న బస్సులో ఇద్దరు మహిళలకు సీటు విషయంలో గొడవ జరిగింది. ఒకరు ఆపిన సీటులో మరొకరు కూర్చోవటంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొని ఘర్షణకు దారితీసింది. తోటి ప్రయాణికులు వారించిన గొడవ సద్దుమణగకపోవడంతో బస్సును అశ్వాపురం పోలీస్‌స్టేషన్ వద్ద ఆపి, విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సీఐ అశోక్‌రెడ్డి ఇద్దరు మహిళలకు కౌన్సెలింగ్ ఇచ్చి, వేర్వేరు బస్సుల్లో పంపించేశారు.

ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా



అదుపు తప్పి బోల్తా పడిన లారీ

అశ్వారావుపేటరూరల్: ధాన్యం లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నుంచి ధాన్యం బస్తాల లోడుతో విశాఖపట్నానికి వెళ్తున్న లారీ అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం కాలనీ సమీపంలో ఎదురుగా వచ్చిన మరో వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, కీనర్ సురక్షితంగా బయటపడగా, లారీ ముందు భాగం ధ్వంసమైంది.

పేకాటరాయుళ్లు అరెస్ట్

అశ్వాపురం: మండల పరిధిలోని కుమ్మరిగూడెంలో మిషన్ భగీరథ పంప్‌హౌస్ వద్ద పేకాటస్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. 10 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. రూ.20 వేల నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో కొత్తగూడెం హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహిస్తున్న మండలానికి చెందిన కానిస్టేబుల్ పాయం సత్యనారాయణ కూడా ఉన్నాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

దాడి ఘటనలో నలుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సతీష్ కుమార్

పాల్వంచ: బైక్‌పై వెళ్తున్న వ్యక్తులను బెదిరించి, దాడి చేసి డబ్బులు లాక్కున్న వ్యక్తులను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ సతీష్ కుమార్ కథనం ప్రకారం.. ఈ నెల 12వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో పాల్వంచకు చెందిన తిరుమల రాజు, అతని బావ మంగయ్య కలిసి బైక్‌పై శేఖరం బంజర వెళుతున్నారు. ఈక్రమంలో ముగ్గురు వ్యక్తులు ఊరి చివర రైల్వే ట్రాక్ పక్కనే ఉన్న రోడ్డుపై ఆటోను అడ్డంగా పెట్టారు. బైక్ నిలపడంతో రాజు, మంగయ్యలను కొట్టి సెల్ ఫోన్, రూ.5 వేల నగదు బలవంతంగా లాక్కుని పారిపోయారు. కాగా ఆటో వెనుక సోగ్గాడు అని రాసి ఉండటాన్ని గమనించిన బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శేఖరం బంజరకు చెందిన బానోతు కిషోర్, బానోతు కుమార్, భూక్యా పవన్‌లను అరెస్ట్ చేశారు. సమావేశంలో సీఐ సతీష్, ఎస్ఐ సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



బోడ భద్రు (ఫైల్)

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ గ్రామానికి చెందిన బోడ భద్రు(47) ఈ నెల 13న రాత్రి చుక్కాలబోడులో ఓ శుభకార్యానికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మంగళితండా సమీపంలో గేదెలను బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఖమ్మం, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య తార, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో..

- రూ.4.61లక్షలు కాజేసిన సైబర్ నేరగాడు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన మండలోజు భార్గవి అనే యువతి వద్ద డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ నేరగాడు భారీగా నగదు కాజేశాడు. వివరాలు ఇలా.. గత ఏడాది డిసెంబర్ 27న యువతికి ఓ వ్యక్తి వాట్సప్ వీడియో కాల్ చేశాడు. నీ ఐడీ ప్రూఫ్స్ తో డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు సమాచారం వచ్చిందని, డిజిటల్ అరెస్ట్ చేశామని చెప్పి భయపెట్టాడు. ఆమె నుంచి డిసెంబర్ 27 నుంచి 2025 జనవరి 1వ తేదీ వరకు పలు దఫాలుగా వివిధ అకౌంట్ నంబర్లకు రూ. 4.61 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఈ విషయమై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రూ. 84,634 నగదు హోల్డ్‌లో పెట్టారు. బాధితురాలు గురువారం మళ్లీ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు

టేకులపల్లి: బైక్ అదుపు తప్పి కింద పడి తండ్రీ కొడుకులు గాయపడ్డ ఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా రఘునాథపాలేనికి చెందిన కె.వెంకటేశ్వర్లు, ఆయన కుమారుడు రమేష్ బైక్‌పై మణుగూరులో ఓ వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో సాయపేట దాటిన తర్వాత మూలమలుపు సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో ఇద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. అదే సమయంలో ఇల్లెందు నుంచి టేకులపల్లికి విధులకు వస్తున్న విద్యుత్ ఏఈ హట్కర్ దేవా గమనించి క్షతగాత్రులను ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఆస్పత్రిలో చేర్పించారు.

గంజాయి సీజ్



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

భద్రాచలంఅర్బన్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా, ఆపి తనిఖీ చేయడంతో 9 కేజీల గంజాయి లభించింది. విచారించడంతో ఏపీలోని విజయవాడకు చెందిన ప్రణీత్, షేక్ కలిసాలు చిత్రకొండ నుంచి గంజాయి తరలిస్తున్నట్లు తేలింది. నిందితులను, గంజాయి, ద్విచక్రవాహనాన్ని స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ అప్పగించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రమేష్ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.5 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

దుమ్ముగూడెం : వివాహిత ఆత్మహత్యపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బండారుగూడెం గ్రామానికి చెందిన బుద్దుల సురేష్‌కు ఎటపాకకు చెందిన సునీత(32)తో 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. సురేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 10న కూర విషయంలో భార్యాభర్తల మధ్య వాగ్వాదం నెలకొంది. దీంతో మనస్తాపం చెందిన సునీత పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటప్పయ్య తెలిపారు.

సులభం.. సత్వరం

- స్లాట్ బుకింగ్‌తో 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి
- పైలట్‌గా ఉమ్మడి జిల్లాలో మూడుచోట్ల అమలు
- త్వరలోనే అన్ని కార్యాలయాల్లో విధానం



రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ అందజేస్తున్న ఖమ్మం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ సంపత్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ తక్కువ సమయంలో పూర్తవుతోంది. స్లాట్ బుక్ చేసుకున్న సమయానికి వెళ్తే 15 నిమిషాల్లో పని పూర్తవుతుండగా, మరో పది నిమిషాల్లో దస్తావేజులు ఇస్తున్నారు. దీంతో రోజంతా పడిగాపులు కాయాల్సిన ఇబ్బందులు తప్పాయి. ఈవిధానంతో క్రయ విక్రయదారుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా.. రిజిస్ట్రేషన్ కార్యాలయాల ఉద్యోగుల నుంచి సానుకూలత వస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం ఆర్ఓ కార్యాలయం, కొత్తగూడెం, కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం అమలవుతుండగా.. త్వరలోనే అన్ని కార్యాలయాల్లోనూ అమలుకు సిద్ధమవుతున్నారు.

గంటల కొద్దీ వేచి ఉండి..

గతంలో దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం రోజంతా క్రయ, విక్రయదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పడిగాపులు కాయాల్సి వచ్చేది. దీంతో ఇద్దరికీ సమయం కుదరక పలుమార్లు వాయిదా వేసుకునేవారు. మరోవైపు కార్యాలయాల్లోనూ రద్దీ ఉండేది.

ఏప్రిల్ 10 నుండి ఇప్పటివరకు స్లాట్ విధానంలో జరిగిన రిజిస్ట్రేషన్లు

కార్యాలయం	డాక్యుమెంట్లు	ఆదాయం
ఖమ్మం ఆర్ఓ	1,164	రూ.10.21 కోట్లు
కొత్తగూడెం	698	రూ.2.41 కోట్లు
కూసుమంచి	530	రూ.97 లక్షలు

ఒకే సమయాన పెద్దసంఖ్యలో జనం వస్తుండడంతో కార్యాలయ ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఒక్కోసారి డాక్యుమెంట్లన్నీ పూర్తిగా పరిశీలించేందుకు సమయం దొరికేది కాదు. కానీ ఇప్పుడు స్లాట్ బుకింగ్‌తో ఈ ఇబ్బందులన్నీ తొలగిపోయాయి.

చిన్నచిన్న సమస్యలతో..

పైలట్ ప్రాజెక్టుగా ఉమ్మడి జిల్లాలోని మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలుచేస్తోంది. తొలిసారి కావడంతో చిన్నచిన్న సమస్యలు ఎదురవుతున్నా అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పాత కంప్యూటర్లు, సర్వర్లను మార్చడంపై దృష్టి సారించిన నేపథ్యాన ఈ నెలాఖరు నాటికి సమస్యలన్నీ తీరతాయని చెబుతున్నారు.

అన్ని కార్యాలయాల్లో..

స్లాట్ బుకింగ్ విధానం ద్వారా రిజిస్ట్రేషన్‌తో మంచి మంచి ఫలితాలు వచ్చినందున విధానాన్ని త్వరలోనే అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా 25కార్యాలయాల్లో అమలు చేయగా.. ఇటీవల రెండో దశలో మరో 25 కార్యాలయాలు ఎంపిక చేశారు. ఈనెల 1 నుంచే అన్ని చోట్లా ఈ విధానాన్ని అమలు చేయాలని భావించినా సాంకేతిక కారణాలతో జూన్ 1వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిసింది. ఇప్పటికే అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కొద్ది నిమిషాల్లోనే మెసేజ్



గతంతో పోలిస్తే పని సులువైంది. స్లాట్ సమయానికి వస్తే నిమిషాల్లో పని పూర్తయింది. ఆపై డాక్యుమెంట్లు తీసుకెళ్లాలని ఫోన్‌కు మెసేజ్ కూడా వచ్చింది. రిజిస్ట్రేషన్ అయిన రోజే డాక్యుమెంట్లు ఇవ్వడం బాగుంది.

– పొదిల సత్యనారాయణ, టేకులపల్లి

15నిమిషాల్లో ముగిసింది..



స్థలం రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకుని వస్తే 15 నిమిషాల్లోనే పూర్తి చేశారు. గతంలో రోజు మొత్తం ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు త్వరగా పూర్తయింది. ఇక ఇబ్బంది లేకుండా కొద్దిసేపట్లోనే దస్తావేజులు ఇచ్చేశారు..

– ఎల్.సురేష్‌కుమార్, సాయిగణేష్‌నగర్

'సీతారామ' పరిహారం చెల్లించాలి

మంత్రి తుమ్మల వద్ద రైతుల ఆవేదన



మంత్రి తుమ్మలకు విన్నవిస్తున్న జూలూరుపాడు రైతులు

దమ్మపేట: సీతారామ ప్రాజెక్ట్ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని కోరుతూ జూలూరుపాడు మండల పరిధిలోని రైతులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. గురువారం మండలంలోని గండుగులపల్లి నివాసంలో మంత్రి తుమ్మలను, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జూలూరుపాడు మండలంలో సీతారామ ప్రాజెక్టు కాలువకు భూములు ఇచ్చిన రైతులు మంత్రిని కలిసి తమకు పరిహారం ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తుమ్మల సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిహారం సకాలంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, కే.వి.సత్యనారాయణ, దొడ్డా ప్రసాద్, మన్నెం అప్పారావు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'నవోదయ' విద్యార్థుల ప్రతిభ

కూసుమంచి: పాలేరు నవోదయ విద్యాలయ విద్యార్థులు ఇటీవల వెల్లడైన సీబీఎస్ఈ 10, 12వ తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. వివరాలను ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గురువారం వెల్లడించారు. ప్లస్ టూ (12వ తరగతి) పరీక్షలకు 48 మంది విద్యార్థులు హాజరుకాగా వంద శాతం ఉత్తీర్ణత నమోదైందని, ఇందులో 34 మంది డిస్టింక్షన్‌లో, 14 మంది మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని వెల్లడించారు. కాగా, 575 మార్కులతో రాఘవేంద్ర, 566 మార్కులతో నిఖిల్ టాపర్లుగా నిలిచారని తెలిపారు. అలాగే, పదో తరగతి ఫలితాల్లో 79 మందికి వంద శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, 65 మంది డిస్టింక్షన్‌లో, 12 మంది ప్రథమ శ్రేణిలో, ఇద్దరు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని, 583 మార్కులతో యోక్షిత్ టాపర్‌గా నిలిచాడని ప్రిన్సిపాల్ వివరించారు.

ఏకలవ్య విద్యాలయాల్లో ఇంటర్ ప్రవేశాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఎనిమిది ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏడు, ఖమ్మం జిల్లాలో ఒక విద్యాలయం ఉండగా, 2024–25లో పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు అర్హులని వెల్లడించారు. సీబీసీఎస్ సిలబస్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హ్యూమనిటిక్స్ గ్రూపుల్లో ప్రవేశానికి ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గండుగులపల్లి, గుండాలలో బాలికలకు ఎంపీసీ, సీఈసీ, పాల్వంచలో బాలికలకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు, టేకులపల్లిలో బాలురకు బైపీసీ, సీఈసీ, దుమ్ముగూడెంలో బాలురు, బాలికలకు ఎంపీసీ, బైపీసీ, హ్యూమనిటిక్స్ గ్రూపులు, చర్ల, ములకలపల్లి, సింగరేణిలో బాలురు, బాలికలకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో బోధన ఉంటుందని, పదో తరగతి మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని పీఓ వెల్లడించారు. కాగా, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 26న ఉదయం చర్ల, భద్రాచలంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

క్లుప్తంగా...

ఫీజు బకాయిలు వెంటనే చెల్లించండి

ముఖ్యమంత్రికి బండి సంజయ్ బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏటా నిర్ణీత వ్యవధిలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గురువారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యపూరిత ధోరణితో లక్షలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, నర్సింగ్ సహా వేలాది కాలేజీలు పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయాయని పేర్కొన్నారు. గత నాలుగేళ్లుగా ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో దాదాపు 8 వేల కోట్ల రూపాయలు బకాయిలుగా పేరుకుపోయినట్లు ఆయన తెలిపారు. ప్రైవేట్ కళాశాలలు అధ్యాపకులకు, సిబ్బందికి జీతభత్యాలు, నిర్వహణ ఛార్జీలు కూడా చెల్లించలేక అవస్థలు పడుతూ.. అప్పుల పాలయ్యాయని పేర్కొన్నారు. ఫీజు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇచ్చేది లేదని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు తెగేసి చెబుతుండటంతో విద్యార్థులు అటు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోలేక, ఇటు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బండి సంజయ్ తెలిపారు.

సినీ జర్నలిస్ట్ - రచయిత బీకే ఈశ్వర్ కన్నుమూత

సాక్షి, హైదరాబాద్: సీనియర్ సినిమా జర్నలిస్ట్, ప్రముఖ సినీ రచయిత బీకే ఈశ్వర్ (77) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. విజయవాడకు చెందిన బీకే ఈశ్వర్ 'విజయచిత్ర' పత్రికలో రెండు దశాబ్దాలపాటు ఉప సంపాదకునిగా పనిచేశారు. పలు పత్రికలకు, వీక్లీలకు వ్యాసాలు రాయడంతోపాటు కొన్ని టీవీ సీరియల్స్ కూడా రాశారాయన. వాటిలో కొన్ని నంది అవార్డులను అందుకున్నాయి. 'హృదయాంజలి' చిత్రానికి మాటలు, పాటలు అందించారు. అదే విధంగా 'కాలేజ్ డేస్ టు మ్యారేజ్ డేస్, చీకటిలో నేను, నగరంలో వినాయకుడు, జంబో క్రైమ్ స్టోరీ, అజయ్ పాసయ్యాడు, నేను-ఆదీ- మధ్యలో మా నాన్న'వంటి సినిమాలకు రచయితగా పనిచేశారు. 'సూపర్ మూవీస్ అడ్డా' పేరుతో సొంత యూట్యూబ్ చానెల్‌ను నిర్వహించారు.

'సరస్వతి' పునాదిగా

పుష్కర వేడుకలు

త్వరలో వచ్చే గోదావరి, కృష్ణా పుష్కరాలనూ ఘనంగా నిర్వహిస్తాం

- సమ్మక్క సారలక్క జాతరను వైభవంగా జరిపిస్తాం
- ఈ అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా...
- కాళేశ్వరం ప్రాంతానికి ఘనచరిత్ర ఉంది.. ఈ ప్రాంత అభివృద్ధికి రూ.200 కోట్లు
- చతుర్వేద పుష్కరఘాట్ వద్ద ఘనంగా సరస్వతి పుష్కరాలు ప్రారంభం
- త్రివేణి సంగమంలో మంత్రులతో కలిసి సీఎం పుష్కరస్నానం



శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఆది శ్రీనివాస్

కాళేశ్వరం నుంచి సాక్షి ప్రతినిధి, వరంగల్

'సరస్వతి పుష్కరాలు పునాదిగా త్వరలో వచ్చే గోదావరి, కృష్ణా పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం. మేడారం సమ్మక్క సారలక్క జాతరను ఘనంగా జరిపిస్తాం. తెలంగాణ ప్రభుత్వం నా హయాంలో ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహించడం నా అదృష్టంగా భావిస్తున్నా' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నదులను పూజించడం మన సంస్కృతి, సంప్రదాయమని, అందుకే నదులను దేవతలు, దేవుళ్లుగా పూజిస్తున్నామని చెప్పారు. జేఎస్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో గురువారం ప్రారంభించిన సరస్వతి పుష్కర వేడుకల్లో రేవంత్ పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 4.12 గంటలకు కాళేశ్వరం చేరుకున్న రేవంత్‌రెడ్డికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం రేవంత్ సరస్వతి ఘాట్‌ను ప్రజలకు అంకితం చేశారు. ఘాట్ వద్ద ఏర్పాటుచేసిన వేదికపై నుంచి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. మెదక్ జిల్లా రంగంపేటకు చెందిన మాధవానంద సరస్వతి స్వామిజీ ప్రారంభించిన పుష్కరాలు ఈ నెల 26 వరకు కొనసాగుతాయి.

కాళేశ్వరం అభివృద్ధికి రూ.200 కోట్లు

మంథని నియోజకవర్గానికి పెద్ద చరిత్ర ఉందని, దేశ ఆర్థికాభివృద్ధికి ఆద్యుడైన పీవీ నరసింహారావు మంథని నుంచి గెలిపొందారని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రపంచంలో మన దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేసిన ఆయన మంథని ప్రాంతానికి ఎంతో చేశారన్నారు. రాష్ట్రానికి రూ.వేల కోట్ల పెట్టుబడులను తేవడంలో మంత్రి శ్రీధర్‌బాబు కృషి చాలా గొప్పదని కొనియాడారు. మంథని నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కష్టపడే శ్రీధర్ బాబును ప్రజలే కాపాడుకోవాలన్నారు. ఆయన సేవలు రాష్ట్రం యావత్తు అవసరమని, ఆయన నియోజకవర్గ అభివృద్ధికి తక్కువ సమయం కేటాయించి, రాష్ట్ర అభివృద్ధికి ఎక్కువ సమయం కేటాయించాలని సూచించారు. కాళేశ్వరాన్ని గొప్పగా అభివృద్ధి చేయడానికి రూ.100 కోట్లు కావాలని శ్రీధర్‌బాబు అడిగారని, కానీ తాము రూ.200 కోట్లయినా వెచ్చిస్తామని రేవంత్ చెప్పారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాళేశ్వరం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని మంత్రి సురేఖ, ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్‌లను కోరుతున్నానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి గ్రీన్ చానల్‌లో నిధులు విడుదల చేస్తామని చెప్పారు.

టెంట్ సిటీ వద్ద గంటసేపు..

హెలిప్యాడ్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి వీఐపీ ఘాట్ సమీపంలో భక్తులకోసం ఏర్పాటు చేసిన టెంట్ సిటీకి చేరుకున్నారు. రేవంత్ సుమారు గంటపాటు టెంట్ సిటీలో గడిపారు. పుష్కరాల ఏర్పాట్లు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులతో పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. పుష్కర ఘాట్ త్రివేణి సంగమం ఒడ్డున ఏర్పాటు చేసిన 17 అడుగుల సరస్వతీ మాత విగ్రహం, రెండు వైపుల చతుర్వేద మూర్తుల విగ్రహాలను రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం త్రివేణి సంగమంలో మంత్రులతో కలిసి పుష్కర పుణ్యస్నానం ఆచరించారు. తర్వాత శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి, శుభానంద దేవిని, ప్రౌఢ సరస్వతి మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీఎం, మంత్రులు, వారణాసి నుంచి వచ్చిన అశుతోష్ పాండే, 8 మంది వేద పండితుల బృందం ఆధ్వర్యంలో మహా సరస్వతి నవరత్న మాలిక హారతి ఇచ్చారు. శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని ఆహ్వానించలేదని నిరసన

భూపాలపల్లి: సరస్వతి పుష్కరాలకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఆహ్వానించలేదంటూ అతడి వర్గీయులు నిరసన చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి పుష్కర ఘాట్ వద్ద సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సమయంలోనే చెన్నూరు నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సభాస్థలి ఎదుట నిలబడి ఫ్లెక్సీలతో నిరసన చేపట్టారు. ఈ క్రమంలో సీఐ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఒక నాయకుడిపై చేయి చేసుకున్నారు. పోలీసు ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం భక్తులు, మీడియా, వీఐపీలకు ఇబ్బందికరంగా మారింది.

రూ.12,600 కోట్లతో ఐఎస్‌జీజేవీ

- ఆర్వోఎఫ్ఆర్ భూఅభివృద్ధికి ఇందిర సౌరగిరి జల వికాసం
- రానున్న ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 2.10 లక్షల గిరిజన రైతులకు లబ్ధి
- పథకం అమలుకు మార్గదర్శకాల విడుదల

సాక్షి, హైదరాబాద్: అటవీ హక్కుల చట్టం-2006 కింద గుర్తింపు పొందిన గిరిజన రైతుల భూముల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా ఇందిర సౌరగిరి జల వికాసం (ఐఎస్‌జీజేవీ) పథకాన్ని అమలు చేయనుంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు, నిధుల కేటాయింపులు తదితర వివరాలతో కూడిన ఉత్తర్వులను గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్ గురువారం విడుదల చేశారు. ఐఎస్‌జీజేవీ పథకం కింద రానున్న ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.12,600 కోట్లు ఖర్చు చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 2.10 లక్షల మంది రైతులను ఎంపిక చేస్తూ, వారికి చెందిన 6 లక్షల ఎకరాల భూములను అభివృద్ధి చేస్తూ సౌరవిద్యుత్‌తో జలసిరులు వచ్చే విధంగా వ్యవసాయ యోగ్యంగా మార్చడంతోపాటు అందులో వివిధ రకాల వ్యవసాయ కార్యక్రమాల అమలుకు ఈ నిధులు ఖర్చు చేయనుంది. ఒక్కో రైతును ఒక యూనిట్‌గా పరిగణిస్తూ.. ఒక్కో యూనిట్‌పైన రూ.6 లక్షలు చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.

18న ప్రారంభించనున్న సీఎం

ఆర్వోఎఫ్ఆర్ చట్టం-2006 కింద రాష్ట్రంలో 6.69 లక్షల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేశారు. తాజాగా ఐఎస్‌జీజేవీ పథకం కింద ఈ భూములను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ పథకాన్ని ఈనెల 18న అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఈమేరకు గిరిజన సంక్షేమశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ పథకాన్ని 2025-26 నుంచి 2029-30 వరకు వందశాతం రాయితీతో అమలు చేస్తారు. అటవీ శాఖ, ఇంధన శాఖ, ప్రజారోగ్యం, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, భూగర్భ జల వనరులు, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ మరియు ఇతర సహకార విభాగాల సమన్వయంతో అమలు చేస్తారు. ఐఎస్‌జీజేవీ అమలు కోసం, జిల్లా స్థాయిలో ఇన్‌చార్జ్ మంత్రి అనుమతితో కలెక్టర్ ఖరారు చేస్తారు. పథకం అమలును పర్యవేక్షించడానికి జిల్లాల్లో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లు (పీఎంయూ) ఏర్పాటు చేస్తారు.

ఐదేళ్ల వార్షిక ప్రణాళిక ఇలా...

సంవత్సరం	ఎస్టీ రైతులు	విస్తీర్ణం	బడ్జెట్(రూ.కోట్లలో)
2025-26	10,000	27,184	600
2026-27	50,000	1,43,204	3,000
2027-28	50,000	1,43,204	3,000
2028-29	50,000	1,43,204	3,000
2029-30	50,000	1,43,204	3,000
మొత్తం	2,10,000	6,00,000	12,600

రూ.8.6 కోట్ల నగదు.. రూ.23 కోట్ల నగలు

- వీవీఎంసీ డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి ఇళ్లు, ఆఫీసుల్లో ఈడీ స్వాధీనం
- అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చి భారీగా అక్రమాస్తుల ఆర్జన
- ఏపీ, తెలంగాణలో స్థిరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చి భారీ మొత్తంలో ఆస్తులు కూడబెట్టిన వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ (వీవీఎంసీ) టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి గుట్టు రట్టు చేశారు ఈడీ ముంబై జోనల్ కార్యాలయం అధికారులు. వీవీఎంసీలో అక్రమంగా 41 భవనాలు నిర్మించిన కుంభకోణంలో ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టి వైఎస్ రెడ్డి ఇళ్లు, ఆఫీసుల్లో సోదాలు నిర్వహించింది. బుధ, గురువారాల్లో ముంబై, హైదరాబాద్‌లోని మొత్తం 13 ప్రాంతాల్లో చేపట్టిన సోదాల్లో రూ.8.6 కోట్ల నగదుతోపాటు రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు ఏపీ, తెలంగాణలో స్థిరాస్తులకు సంబంధించి పెద్దమొత్తంలో డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

హైకోర్టు తీర్పుతో..

ముంబై వీవీఎంసీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో రెసిడెన్షియల్, కమర్షియల్ కాంప్లెక్సులు అక్రమంగా నిర్మించారు. ఆ ప్రాంతం వీవీఎంసీ అభివృద్ధి ప్రణాళిక ప్రకారం మురుగునీటి శుద్ధి కర్మాగారం, డంపింగ్ గ్రౌండ్ నిర్మాణం కోసం రిజర్వు చేయబడింది. ఇందులో 2009 నుంచి 41 అక్రమ భవనాలు నిర్మించారు. ముంబై హైకోర్టు ఆదేశంతో ఈ అక్రమ నిర్మాణాలను ఈ ఏడాది ఫిబ్రవరి 20న కూల్చివేశారు. ఈ వ్యవహారంలో ముంబైలోని మీరా భయాందర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ కుంభకోణంలో కీలక నిందితులుగా బిల్డర్లు సీతారాం గుప్తా, అరుణ్ గుప్తా సహా వీవీఎంసీ అధికారులు, మరికొంత మందిని గుర్తించింది. అక్రమ నిర్మాణాలకు వైఎస్ రెడ్డి అనుమతులు ఇచ్చినట్లు ఈడీ విచారణలో తేలింది. కేసు దర్యాప్తులో భాగంగానే వైఎస్‌రెడ్డి నివాసంలో ఈడీ అధికారులు గత రెండు రోజులుగా సోదాలు నిర్వహించారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్టు తెలిపారు.

జిల్లా వార్తలు

జాతీయ కార్మిక సంఘాల సమ్మె జూలై 9కి వాయిదా

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక రంగ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 20న సమ్మె చేపట్టనున్నట్లు జాతీయ కార్మిక సంఘాలు ప్రకటించగా, దీన్ని జూలై 9కి వాయిదా వేసినట్లు సంఘాల జేఏసీ నాయకులు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా గురువారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. అయితే, ఈ నెల 20న పని ప్రదేశాల్లో ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

సింగరేణి ఆస్పత్రిలో సీఎండీ తనిఖీ



చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రిని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అత్యవసర వార్డు సహా అన్ని వార్డుల్లో పరిశీలించి చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి వైద్యసేవలపై ఆరాతీశారు. ఆ తర్వాత ఫార్మసీని పరిశీలించి మందుల లభ్యతపై తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. సంస్థ కార్మికుల ఆరోగ్యం, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నందున వైద్యులు, సిబ్బంది మెరుగైన సేవలందించాలని సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఎంఓ కిరణ్‌రాజ్‌కుమార్, ఏసీఎంఓలు ఎం.ఉష, సునీల, సీనియర్ పీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొంగు చల్లారింది !



- మండువేసవిలో బీర్లకు తగ్గిన డిమాండ్
- ఇదే సమయాన పెరిగిన లిక్కర్ అమ్మకాలు
- బీర్ల ధరలు పెరగడమే కారణమని అంచనా



వైరాలోని డిపో నుంచి వైన్స్‌కు తరలిస్తున్న మద్యం

వైరా: ఓవైపు ఎండలు మండిపోతున్నాయి. సాధారణ జనమంతా చల్లని నీళ్లు లేదంటే కొబ్బరి నీళ్లు, కూల్‌డ్రింక్‌లతో తమ దాహార్తి తీర్చుకుంటారు. అదే మందుబాబులైతే ఈ రెండు నెలలు మద్యాన్ని పక్కన పెట్టేసి బీర్ల వైపు మొగ్గు చూపుతారు. తద్వారా ఏటా వేసవిలో బీర్లకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. రెండేళ్ల క్రితమైతే బీర్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదు కాగా.. కొన్ని వైన్స్‌ల ఎదుట 'నో స్టాక్' బోర్డులు దర్శనమిచ్చాయి. కానీ ఈ ఏడాది అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. వైరాలోని డిపో నుంచి ఉమ్మడి జిల్లాలోని వైన్స్, బార్లకు మద్యం సరఫరా చేస్తుండగా ఏప్రిల్, మే నెలల్లో బీర్ల అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేవని ఎక్సైజ్ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

60వేల కేసులు డౌన్

వేసవిలో బీర్ల అమ్మకాలు పెరగాల్సింది పోయి లిక్కర్ విక్రయాలు విపరీతంగా పెరుగుతుండడం గమనార్హం. వైరాలోని డిపో నుంచి గతేడాది ఏప్రిల్‌లో రూ.181 కోట్లకు పైగా మద్యం అమ్మకాలు సాగగా ఈ ఏడాది రూ.167 కోట్లకు అది పడిపోయింది. గతేడాది ఏప్రిల్‌లో డిపో నుంచి 2,25,739 బీరు కేసులు అమ్ముడవగా, లిక్కర్ 2,13,172 కేసులు అమ్ముడయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో మాత్రం బీర్లు 1,64,966 కేసులకే పరిమితం కాగా, లిక్కర్ కేసులు మాత్రం 2,00,507 అమ్ముడయ్యాయి. అంటే బీర్ల అమ్మకం 60,733 కేసుల మేర తగ్గింది.

ధరలు పెరిగాయనా?

ఉమ్మడి జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా వేసవిలో బీర్ల అమ్మకాలు పడిపోయాయి. గత నవంబర్‌లో ప్రభుత్వం ఒక్కో బీర్ ధరను రూ.20నుంచి రూ.40 మేర పెంచింది. మరోవైపు వాతావరణంలో తరచూ మార్పులు వస్తున్నాయి. రోజంతా ఎండ ఉన్నా సాయంత్రమయ్యే సరికి గాలిదుమారం, వాన ప్రభావం చూపిస్తోంది. ఈ కారణంగా కూడా బీర్ల అమ్మకాలు తగ్గాయని అంచనా వేస్తున్నారు. అయితే, ఏప్రిల్‌తో పోలిస్తే ఈనెలలో కాస్త పరిస్థితి మెరుగవుతోందని.. రానున్న రోజుల్లో ఇది మరింత పుంజుకుంటుందని వైన్స్, బార్ల యజమానులే కాక ఎక్సైజ్ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలోని ఏడు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో మద్యం అమ్మకాలు

	ఏప్రిల్ 1నుంచి 30 వరకు			మే 1నుంచి 13 వరకు		
సర్కిల్	లిక్కర్ కేసులు	బీర్ కేసులు	విలువ (రూ.కోట్లలో)	లిక్కర్ కేసులు	బీర్ కేసులు	విలువ (రూ.కోట్లలో)
ఖమ్మం-1	39,589	32,527	34.58	11,782	19,325	11.71
ఖమ్మం-2	22,536	18,526	19.16	8,087	12,096	7.67
మధిర	14,309	9,792	11.21	2,176	2,163	1.83
నేలకొండపల్లి	12,907	12,825	10.95	5,284	6,185	4.65
సత్తుపల్లి	18,849	11,618	14.12	8,168	4,331	5.83
సింగరేణి	8,415	5,257	6.34	4,442	4,514	3.78
వైరా	12,653	7,204	9.43	5,363	3,682	4.05
మొత్తం	1,29,258	97,749	105.79	45,302	52,296	39.52



ఆదివాసీల అంగడి.. సందడి..





ఆదివాసీ అంగడిలో జనం

- నాణ్యమైన, తాజా కూరగాయల విక్రయం
- ధరలోనూ బయటి మార్కెట్‌తో పోలిస్తే తక్కువ
- కొనుగోలుకు పట్టణవాసుల ఆసక్తి

భద్రాచలంటౌన్: ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలు గతంలో తమ కుటుంబం వరకు కావాల్సిన కూరగాయలు, ఇతర పంటలే పండించేవారు. కానీ పెరుగుతున్న ఖర్చులు, కుటుంబ భారంతో పంటల సాగు కొద్దికొద్దిగా విస్తరిస్తున్నారు. ఈ క్రమాన ఆదివాసీలు రసాయన ఎరువులు వాడకపోవడంతో పంటలు నాణ్యంగా ఉంటుండడమే కాక ధరల్లోనూ బయటి మార్కెట్‌తో వ్యత్యాసం ఉండడంతో పట్టణవాసులు కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కేవలం ఆకుకూరలు, కూరగాయలే కాక అటవీ ఫలాలు సైతం అమ్ముతున్న ఆదివాసీలు కుటుంబ అవసరాలు తీర్చుకుంటున్నారు.

భద్రాచలంలో ప్రత్యేకం..

రాష్ట్ర విభజన సమయాన ఏపీలోకి వెళ్లిన పలు గ్రామాలు, మండలాల నుంచి ఆదివాసీలు తాము సాగు చేసిన పంటలను భద్రాచలంలో విక్రయిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా పాత కూరగాయల మార్కెట్‌లోని ఐటీడీఏ కాంప్లెక్స్ ముందు ఖాళీ స్థలాన్ని ఎంచుకున్నారు. ఇక్కడ ఆదివాసీ గిరిజనులు మాత్రమే కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తుండగా ఉదయం ఆరు గంటలకు ప్రారంభమయ్యే ఈ ఆదివాసీ అంగడి 11 గంటలకు ముగుస్తుంది. ఇక్కడ కూరగాయలు, ఆకుకూరలు కొద్దిసేపటల్లో అమ్ముడవుతుండడం విశేషం.

అన్నీ తాజాగా..

సాధారణ మార్కెట్ కంటే ఇక్కడ లభించే కూరగాయలు, ఆకుకూరలు తాజాగా ఉంటాయి. తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసే ఆదివాసీలు ఏరోజుకారోజు సేకరించి తీసుకొస్తుండడంతో తాజాగా ఉంటాయని చెబుతున్నారు. అందులోనూ పంటల సాగు రసాయన ఎరువులు వాడకపోవడంతో నాణ్యంగా ఉంటాయని స్థానికులు నమ్ముతున్నారు. అంతేకాక బయటి మార్కెట్‌తో ధరకూడా తక్కువగా ఉండడంతో కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు.

పెరుగుతున్న అమ్మకాలు

భద్రాచలంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ కంటే ఆదివాసీలు నిర్వహించే అంగడి పట్టణవాసులతో సందడిగా ఉంటోంది. భద్రాచలం పరిసర గ్రామాల్లో సాగు చేసే కూరగాయలను తీసుకొస్తుండగా రోజురోజుకూ అమ్మకాలు పెరుగుతున్నాయి. ఏపీలోని సరిహద్దు మండలాలైన చింతూరు, కూనవరం, ఎటపాక, కుక్కునూరు నుంచి భారీగా కూరగాయలను సైతం తీసుకొస్తున్నారు. ఇవి కాక సీజన్ ఆధారంగా సీతాఫలాలు, తునికిపండ్లతో పాటు చింతపండు, మినుములు, పెసళ్లు, బొబ్బర్లు, కందులు సైతం తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

మందులు లేని పంటలు

ఇక్కడ మార్కెట్‌లో లభించే కూరగాయలు తాజాగానే కాక స్వచ్ఛంగా ఉంటాయి. గిరిజనులు ఎటువంటి రసాయన మందులు వాడకుండా పండిస్తుంటారు. దీంతో ఇవి ఆరోగ్యానికి మంచివని నాతోపాటు చాలా మంది ప్రతిరోజు ఇక్కడే కొనుగోలు చేస్తున్నారు. -శంకర్, భద్రాచలం

ఐదేళ్లుగా అమ్ముతున్నా..

మాది ఏపీలోని కన్నాయిగూడెం. ఐదేళ్లుగా మా పొలంలో పండించిన కూరగాయలు ప్రతిరోజు ఇక్కడికి తీసుకొచ్చి అమ్ముతున్నాను. మేం తీసుకొచ్చే కూరగాయలు, ఆకుకూరలు తాజాగా ఉంటాయి. దీంతో కొనుగోలు చేసేందుకు చాలామంది వస్తున్నారు. -కృష్ణవేణి, కన్నాయిగూడెం

కూరగాయల సాగుతో లాభం

కూరగాయాలను పండించి ఊర్లలో తిరిగి అమ్మేవాళ్లం. ఇక్కడి మార్కెట్ ఏర్పడ్డాక ప్రతిరోజు ఉదయం తీసుకొచ్చి అమ్ముతున్నా. ప్రజలు చాలామంది వస్తుండడంతో త్వరగా అయిపోతున్నాయి. కూరగాయాల సాగుతో లాభాలు సైతం బాగానే ఉన్నాయి. -భద్రమ్మ, మంగువాయి

కిన్నెరసానిలో పుట్టి తిరిగేనా..?

కలెక్టర్ ఆదేశించి ఐదునెలలైనా ఆచరణ శూన్యం

పాల్వంచరూరల్ : కిన్నెరసానికి వచ్చే పర్యాటకులకు కొత్త అనుభూతిని అందించడంతో పాటు ఒకరికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కెనాల్‌లో పుట్టి ఏర్పాటు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాలు జారీచేశారు. అయితే ఐదు నెలలు గడిచినా ఇప్పటివరకు అచరణలోకి రాలేదు. పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో రిజర్వాయర్ నుంచి కేటీపీఎస్ కర్మాగారానికి నీరు సరఫరా చేసే కాల్వలో పుట్టి(నాటు పడవ) తిప్పాలని గత డిసెంబర్‌లో కలెక్టర్ సూచించారు. ఈ మేరకు జిల్లా మత్స్యశాఖ అధికారి ఎండీ ఇంతియాజ్ అహ్మద్ ఖాన్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన నెల రోజుల క్రితం రూ.33 వేలతో పుట్టి కొనుగోలు చేసి పునుకుల గ్రామానికి చెందిన మత్స్యకారుడికి అప్పగించారు. కెనాల్లో పుట్టిని ఎలా తిప్పాలో శిక్షణ కూడా ఇచ్చారు. కానీ ఇంతవరకూ ఆ పుట్టి కాలువలో తిరగడం లేదు. దీనిపై జిల్లా మత్స్యశాఖ అధికారిని వివరణ కోరగా.. కలెక్టర్ ఆదేశాల మేరకు నెల రోజుల క్రితమే పుట్టిని కొనుగోలు చేసి మత్స్యకారుడికి అప్పగించామని, అతడు సొంత పనులు పూర్తి చేసుకున్నాక తిప్పుతామని చెప్పాడని తెలిపారు. పుట్టి విషయం పర్యాటకులకు తెలిసేలా ప్రధాన ద్వారం, పంపుహౌస్ వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించామని చెప్పారు. అయితే, కాలువ నీటిలో పుట్టిని తిప్పాలంటే మధ్యలో పంప్‌హౌస్ గేట్‌వాల్వ్‌ను తొలగించాల్సి ఉంటుంది. ఈ పని పూర్తి చేసి వచ్చే ఆదివారం నాటికైనా కెనాల్‌లో పుట్టిని తిప్పేలా చూడాలని పర్యాటకులు కోరుతున్నారు.



కిన్నెరసాని కాలువలో శిక్షణ పొందుతున్న మత్స్యకారుడు(ఫైల్)